క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కోటపల్లి/వేమనపల్లి: ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా బుధవారం కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామంలో, వేమనపల్లి మండలంలోని కేతన్‌పల్లి గ్రామంలో చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్ రావు, పోలీస్ సిబ్బంది ఆ గ్రామాల ప్రజలకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడల్లో రాణించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం యువతకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు.

అమరవాదిలో బ్రిడ్జి పనులు ప్రారంభం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమరవాది గ్రామంలో రూ.35లక్షలతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణపు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ బుధవారం ప్రారంభించారు. అమరవాది గ్రామం నుంచి మంచిర్యాలకు వెళ్లే మార్గంలో గతంలో ఉన్న బ్రిడ్జి పూర్తిగా శిథిలమై పోవడంతో సమస్యను ఎమ్మెల్యే బాల్కసుమన్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

చెన్నూర్: పట్టణంలోని మారెమ్మవాడలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు మంగళవారం రాత్రి దాడి చేయగా ఆరుగురు దొరికారని, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, రెండు వేల నగదు స్వాధీనం చేసుకున్నామని, వారిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తామని తెలిపారు.

అంబేద్కర్‌కు వినతిపత్రం ఇచ్చి నిరసన



చెన్నూర్‌లో అంబేద్కర్‌కు వినతిపత్రం ఇస్తూ..

బెల్లంపల్లి/భీమిని/కాసిపేట/చెన్నూర్: బెల్లంపల్లి మండలం చాకేపల్లి ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్‌ను అవమానపర్చిన మందమర్రి ఎస్సై చంద్రకుమార్‌పై పోలీసు ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆయా మండల కేంద్రాల్లో బుధవారం అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'దసరా' నటుడికి సన్మానం

జైపూర్: కాసిపేట మండలం సోమగూడెంకు చెందిన గడ్డం సురేశ్ ఇటీవల విడుదలైన దసరా సినిమాలో నటించడమే కాకుండా, సినిమాకు మొత్తం తెలంగాణ యాసను(డైలాగ్స్) అందించి, మూడు పాటలు రాసిన సందర్భాన్ని పురస్కరించుకుని మండలంలోని ఇందారంకు చెందిన చిత్రకళారుడు చిప్పకుర్తి శ్రీనివాస్ బుధవారం సన్మానించారు.

కాసిపేట: మండలంలోని సోమగూడెం పాత బస్తీకి చెందిన గడ్డం సురేష్‌ను ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మల్లేష్, దినేష్, పోశం, రాజలింగు తదితరులున్నారు.

ప్రమోషన్లు ఇవ్వాలని వినతి



శ్రీరాంపూర్: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని హెచ్ఎమ్మెస్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో నాయకులు బుధవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. కంపెనీ వ్యాప్తంగా మిగితా రీజియన్లలో ప్రమోషన్లు ఇచ్చి బెల్లంపల్లి, రామగుండం రీజియన్‌లో ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ప్రమోషన్లు ఇచ్చి ఏరియర్స్ డబ్బులు చెల్లించాలని, లేకుంటే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- నిలిచిన నాలుగు వరుసల బీటీ రోడ్డు పనులు
- కంకరతేలడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



చెన్నూర్‌లో రోడ్డు దుస్థితి

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రూ.18కోట్ల నిధులతో నిర్మించిన నాలుగు వరుసల రోడ్డు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనుల్లో భాగంగా నిర్మించిన రోడ్డు పనులు పూర్తి కాలేదు. అంసపూర్తి పనులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు శాపంగా మారింది. గత నెల 15న ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా అధికారులు అతి ఉత్సాహంతో ఒకపక్క బీటీ వేసి వదిలేశారు. ఆరోగ్య శాఖ మంత్రి రోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రి రోడ్డు పనులను ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా, నేటికి రోడ్డు ఇరువైపులా బీటీ పనులు పూర్తి కాలేదు. మంత్రి ప్రారంభించిన రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అభివృద్ధి పనులు వేగవంతంగా..

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్, జిల్లా ఉన్నతాధికారులు పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

రాత్రి వేళల్లో..

రోడ్డు పనులు పూర్తి కాక కంకర తేలడంతో రాత్రి వేళల్లో రోడ్డుపై వాహనదారులు జారి పడుతున్నారు. వాహనాల కింద పడ్డా కంకర లేచి ఎదురుగా వచ్చే వాహనదారులకు తగలడంతో గాయాల పాలవుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వదిలి బీటీ అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం

మంత్రి పర్యటన వరకు నాలుగు వరసల రోడ్డు పనులు పూర్తి కావాల్సి ఉంది. డాంబర్ కొరత కారణంగా ఒక పక్క పనులు చేయాల్సి వచ్చింది. వారం రోజుల్లో ఇరువైపులా బీటీ వేసి పనులు పూర్తి చేస్తాం. ప్రస్తుతం ఒక్క బీటీ ఒక లేహర్ మాత్రమే వేశాం. మళ్లీ బీటీ వేసి రోడ్డు పనులు పూర్తి చేయిస్తాం.

– సాయికిరణ్, మున్సిపల్ ఏఈ చెన్నూర్

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

- డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

దండేపల్లి: పదవిలో ఉన్నా, లేకపోయినా మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా మాజీ ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తారని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో దండేపల్లి మండలంలోని వివిధ గ్రామాల ముస్లింలకు రంజాన్ తోఫాలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు తమను ఆదరించాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలన్నారు. జిల్లా నాయకుడు త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్, స్థానిక సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు దుర్గప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.



దండేపల్లిలో తోఫా అందజేస్తున్న సురేఖ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రంలో బుధవారం కొక్కిరాల రఘుపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, మండల నాయకులు తోట రవి, నాయికిని సురేందర్, రాజు పాల్గొన్నారు.

కార్పెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

పాతమంచిర్యాల: కార్పెంటర్ వృత్తిదారుల సమస్యల పరిష్కరించాలని బుధవారం జిల్లా కేంద్రం నుంచి సీసీసీ వరకు కార్పెంటర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి మధు మాట్లాడుతూ.. కార్పెంటర్ వృత్తి పనులు చేసే కార్పెంటర్లు విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించిన రేట్ల ప్రకారం పనులు చేయాలని సూచించారు. అసోసియేషన్ నిర్ణయించిన రేట్ల కంటే తక్కువ రేట్లకు పనులు నిర్వహిస్తుండడంతో కులవృత్తిని నమ్ముకుని, ఆ వృత్తి పైనే ఆధారపడ్డ కార్పెంటర్లకు పనులు లేకుండా పోతున్నాయని ఆరోపించారు. కార్పెంటర్లు ఐకమత్యంతో ఉండాలని, కొత్త రేట్ల పట్టిక పుస్తకాలను గురువారం జిల్లా కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులందరి సమక్షంలో సమావేశం నిర్వహించి రేట్ల పట్టికలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమానికి సభ్యులంతా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపు రాంప్రకాష్, జిల్లా విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి జంబోజు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షులు నాగవెల్లి రాజు, కొత్తూరు రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

డూప్లికేట్ ఓట్లు తొలగించాలి



మందమర్రిరూరల్: మండలంలో డూప్లికేట్ ఓటర్ల పేర్లను తొలగించాలని చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీరాములునాయక్ పేర్కొన్నారు. మండలంలో బుధవారం పలు ఏరియాలు తిరిగి సర్వే చేస్తున్న బీఎల్‌వోలను గతంలో ఓటర్ల జాబితాలో తొలగింపులు సరిగ్గా చేసారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఓటరు లిస్టును పూర్తి వెరిఫై చేసి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి తప్పులు లేకుండా సమర్పించాలని సూచించారు.

హమాలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పాతమంచిర్యాల: హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బుధవారం 'చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం' పోస్టర్లను ఆవిష్కరించారు. హమాలీ కార్మికులకు ఉద్యోగ భద్రత, 50ఏళ్లు దాటిన హమాలీ కార్మికులకు పింఛన్‌సౌకర్యం, ఈఎస్ఐ, పీఎఫ్, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించే ధర్నాకు హమాలీకార్మికులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు రాజన్న, శేఖర్, రాములు, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

బల్దియా కమిషనర్ సమ్మయ్య బాధ్యతల స్వీకరణ



బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కె.సమ్మయ్య బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం హైదరాబాద్ సెక్రెటరియేట్‌లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సమ్మయ్యను డెప్యూటేషన్‌పై బెల్లంపల్లి కమిషనర్‌గా సీడీఎంఏ నియామకం చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌ను ఇన్‌చార్జీ బాధ్యతల నుంచి తప్పించి రిలీవ్ చేశారు. ఈ మేరకు కొత్త కమిషనర్ సమ్మయ్య బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: బెల్లంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ నెల 21న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ చేయనున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. అంగవైకల్యం 40శాతం కన్నా ఎక్కువ, మూగా, చెవుడు, కంటి వారికి 100శాతం ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని బెల్లంపల్లి, చుట్టుపక్కల పరిసర ప్రాంత దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్‌శాఖ ఏఈగా గణేష్



లక్సెట్టిపేట: మండల విద్యుత్‌శాఖ పరిధి ఏఈగా గణేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జైపూర్ సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తూ ప్రమోషన్‌పై లక్సెట్టిపేటకు వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించిన మల్లేశ్ స్థానిక సబ్ ఇంజనీర్‌గా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ సబ్‌స్టేషన్‌లో గురువారం ఉదయం 10.30గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి విద్యుత్ డీఈ రాజన్న తెలిపారు. సమస్య పరిష్కార వేదికకు భీమిని, కన్నెపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాల వినియోగదారులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

దర్జాగా అక్రమ వెంచర్లు!

- అనుమతులు లేకుండానే ఏర్పాటు
- ఇష్టారీతిన పంచాయతీ పరిధిలోని ఇసుక, మట్టి వినియోగం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- 'మామూళ్లు'గా వ్యవహరిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని పలు గ్రామాల్లో కొంత మంది రాజకీయ పలుకుబడితో అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. వెంచర్ల ఏర్పాటు కోసం వాగుల్లోని ఇసుకను, సమీప ప్రాంతాల్లోని మట్టిని తోడేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరికొంత మంది ఫామ్‌ల్యాండ్ పేరిట రియల్‌దందా చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం 'మామూళ్ల'గా వ్యవహరిస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వెంచర్లపై దృష్టి సారించాలని, అక్రమంగా జరిగే ఇసుక, మట్టి దోపిడీని అరికట్టాలని పలువురు సూచిస్తున్నారు.

రసూల్‌పల్లి వైపు వెళ్లే రోడ్డులో...

మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీ దాటిన తర్వాత రసూల్‌పల్లి వెళ్లే రోడ్డు పక్కన సుమారు ఐదారు ఎకరాల్లో కొంత మంది ఏర్పాటు చేస్తున్న వెంచర్‌కు ఎలాంటి అనుమతి లేదు. వెంచర్ మధ్యలో కాలువ ఉండడంతో కాలువలోని ఇసుకనే వెంచర్ నిర్వాహకులు అక్రమంగా తోడుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. వెంచర్‌కు అనుమతులు లేవని గ్రామ సర్పంచ్ తిరుపతి, గ్రామ కార్యదర్శి ప్రశాంత్ పేర్కొన్నారు.

100 ఎకరాల్లో మెగా వెంచర్ ...

మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లేమూరు శివారులో ఫామ్‌ల్యాండ్ పేరిట 100ఎకరాల్లో మెగా వెంచర్ ఏర్పాటు చేశారు. సుమారు ఇరవై ఎకరాల వరకు లావణి పట్టా ఉన్నట్లు సమాచారం. ఫామ్‌ల్యాండ్ వెళ్లే మార్గంలో కాలువ ఉండగా, దానిపై గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే కల్వర్టు ఏర్పాటు చేశారు. అలాగే హోటర్ నిర్మాణం చేపడుతున్నారు. సమీపంలోని మట్టిని, కాలువల్లోని ఇసుకను తోడుకుపోయి వెంచర్ చదును చేస్తూ, ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు మామూళ్లగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా కాలువపై వేసిన కల్వర్టు

చర్యలు తీసుకుంటాం

గ్రామ పంచాయతీల్లో వెంచర్ ఏర్పాటు చేయాలంటే అనుమతులు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. మెగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసి, వెళ్లి చూడగా అక్కడ ఎలాంటి ప్లాటింగ్ కనిపించలేదు. అనుమతులు లేకుండా ప్లాటింగ్ చేస్తే తప్పకుడా చర్యలు తీసుకుంటాం.

– శశికళ ఎంపీడీవో, మందమర్రి

పనులు త్వరగా పూర్తి చేయాలి

భీమిని: మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న మినీ బృహత్‌పల్లెప్రకృతి వనం ట్రెంచ్ పనులను ట్రెయినీ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌతమి బుధవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడారు. నర్సరీ, పల్లెప్రకృతి వనాల్లోని మొక్కలకు వారంలో రెండుసార్లు ఉదయం, సాయంత్రం ట్యాంకర్లతో నీటిని అందించి వందశాతం సంరక్షించాలని సూచించారు. ఉపాధిహామీ కూలీల హాజరు వందకు తగ్గకుండా ఉండాలని, లేబర్ పేమెంట్ రూ.200తగ్గకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ పని స్థలాల్లో మంచినీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో క్రీడలు ఆడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీఓ సబ్దర్‌అలీ, ఏపీఓ భాస్కర్‌రావు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ గౌతమి

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట, దౌడేపల్లి, పాత కొమ్ముగూడెం, కొత్త కొమ్ముగూడెం, చందారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అండగా నిలుస్తుందన్నారు. ధాన్యం పూర్తిగా ఆరిన తరువాత కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని కోరారు. అనంతరం వెంకట్రావ్‌పేటలోని నూతనంగా వేసిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, నాయకులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంక్షిప్త వార్తలు

పశువైద్యశాలలకు మందులు సరఫరా చేయాలి

భీమారం: రాష్ట్రవ్యాప్తంగా గల ప్రభుత్వ పశువైద్యశాలకు మందులు సరఫరా చేయాలని గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ బుధవారం హైదరాబాద్ షీప్ డెవలప్‌మెంట్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. జీవాలకు సరిపడే మందులు అందడం లేదని, ప్రైవేట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుందని వివరించారు. పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని మరమ్మతు చేపట్టాలని, అవసరం ఉన్నచోట కొత్త భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసికెళ్లి సమస్యను పరిష్కరిస్తానని బాలరాజు హామీ ఇచ్చినట్లు అశోక్‌యాదవ్ పేర్కొన్నారు.

వయోజన విద్య కేంద్రం పరిశీలన

మంచిర్యాలఅర్బన్: అండాళమ్మకాలనీలో మంగళవారం రాత్రి వయోజన విద్యా కేంద్రాన్ని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ పరిశీలించారు. కేంద్రాల్లో అభ్యసన స్థాయిని అడిగి తెలుసుకున్నారు. అభ్యసన సులువుగా అభ్యసించే విధానాన్ని వివరించారు. వందరోజుల్లో కనీసం చదవడం రాయటం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వయోజన విద్య డీఆర్‌పీ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ శోభ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

నస్పూర్: హైదరాబాద్‌కు చెందిన కుష్ఠు వ్యాధి నివారణ ప్రత్యేక బృందం శాంపిల్ సర్వే కం అసిస్టెంట్ యూనిట్ (ఎస్ఎస్‌సీయూ) సభ్యులు బుధవారం నస్పూర్ పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీలో కుష్ఠువ్యాధిపై నమోదైన కేసుల వివరాలు నమోదు చేసుకున్నారు. కుష్ఠు నివారణకు సంబంధించిన పలు సూచనలు సిబ్బందికి సూచించారు. కుష్ఠు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బృంద సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బృంద సభ్యులు డాక్టర్ సంతోషి, లోకేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఫ్రూట్‌సలాడ్ పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక కార్మెల్ హైస్కూల్‌లో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులకు డీఈవో వెంకటేశ్వర్లు ఫ్రూట్‌సలాడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, ఎంఈవో పోచయ్య, జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ దామోదర్, పీఆర్‌టీయూ టీఎస్ గౌరవ అధ్యక్షురాలు శాంకరి తదితరులు పాల్గొన్నారు.

భవిత కార్యక్రమాలపై అవగాహన

దండేపల్లి: మంచిర్యాల ఎస్ఆర్‌కేఎమ్ డీఎడ్ కళాశాల విద్యార్థులు శిక్షణలో భాగంగా దండేపల్లి భవిత కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. భవిత కేంద్రంలో సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు అందించే కార్యక్రమాల గురించి ఐఈఆర్టీ వెంకటేశ్వర్ రావును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

కోటపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ ఓర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఎంపీపీ మంత్రిసురేఖా, వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు, జెడ్పీకో ఆప్షన్ అజ్గర్‌కు, సర్పంచ్‌లకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ నెల 28నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు, సమ్మెకు మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యదర్శులు రాజశేఖర్, సంతోష్, శ్రీవిద్య, స్వర్ణ, తిరుపతి, వెంకటేశ్, కమలాకర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంపీటీసీ

దండేపల్లి: మండలంలోని మేదరిపేట ఎంపీటీసీ కొంగల నవీన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరాడు. ఎమ్మెల్యే దివాకర్‌రావు నవీన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరిన రామిళ్ల రాధిక

మందమర్రిరూరల్: సింగరేణి డిస్మిస్ కార్మిక సంఘం అధ్యక్షురాలు రామిళ్ల రాధిక పార్టీ సీనియర్ నాయకులు మల్లు రవి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరింది. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన గోళ్ల రాజమల్లు ఇటీవల దళితరత్న పురస్కారం అందుకోవడంతో ఆయనను ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం సత్కరించారు.

నర్సరీల పరిశీలన

కోటపల్లి: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో భాస్కర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని రాంపూర్, ఆన్నారం గ్రామంల్లోని నర్సరీలను బుధవారం ఆయన పరిశీలించారు.

దాసారపు రాజును సన్మానించిన యువకులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లికి చెందిన దాసారపు రాజు ఇటీవల బెల్లంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో యువకులు పూలమాల, శాలువాతో సన్మానించారు.

నల్లబ్యాడ్జీలతో వీఓఏల నిరసన

- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని హెచ్చరిక

జన్నారం/దండేపల్లి/లక్సెట్టిపేట/భీమారం/మందమర్రిరూరల్/కోటపల్లి/బెల్లంపల్లిరూరల్/నెన్నెల/ వేమనపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కాసిపేట: సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు బుధవారం కళ్లకు గంతలు కట్టుకుని, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె ఆగదని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాన్ని పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దండేపల్లి, లక్సెట్టిపేటలో ఐకేపీ వీవోఏలకు డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మందమర్రిలో టీడీపీ పెద్దపెల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, బెల్లంపల్లిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, యువజన కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.మహేందర్, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, కాసిపేటలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ సంఘీబావం ప్రకటించారు.



భీమారంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మంచిర్యాలటౌన్: జిల్లా మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు, చిన్నారుల టీకాల కోసం వచ్చిన తల్లులకు ఎండ వేడి నుంచి రక్షణకు బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, నాగేందర్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు.